ఒక్కో అప్లికేషనూ చూస్తూ పక్కన పెడుతున్నాడు జిమ్మీ.

ముక్కుమీదకు జారిన కళ్ళజోడు పైకి తోసి సాలోచనగా తరువాతి అప్లికేషను అందుకున్నాడు. తటాలున అతని కళ్ళలోకి చురుకుదనం వచ్చింది, ఆ అప్లికేషన్‌కి గుచ్చివున్న కలర్ ఫొటో(గ్రాఫ్‌ని చూస్తూనే. విశితంగా ఆ ఫొటోని మరోక్షణం చూశాడు. కనుబొమ ముడివడింది. అతని చూపులు ఆ ఫొటోలోని యువకుని కళ్ళపైన ఆగిపోయాయి.

# నీలి కళ్ళు

ఎ.వి. మంగపతిరావు

"నీలి కళ్ళు . . . . గొణుక్కున్నాడు.

మనసంతా ఆ(క్రమించుకుంటున్న అనుమానాన్ని ని(గహించుకుంటూ కొద్దిక్షణాల తర్వాత ఫొటో తిప్పాడు జిమ్మీ.

"విక్టర్ ఓలన్"-అప్లికేషన్ పై వరుసలో అందంగా కన్పిస్తున్న పేరు చూస్తూనే ఉలిక్కి పడ్డాడు.

ఇక మరోసారి ఫొటో చూసే ధైర్యం లేకపోయింది.

నిస్త్రాణగా కుర్చీలో వెనక్కి వాలిపోయాడు. ముఖమంతా చెమటలు పట్టినట్లయింది. వణుకుతున్న చేతుల మధ్యనించి అప్లికేషన్ టేబిల్‌పైకి జారిపోయింది. చికాకుగా వీల్‌ఛెయిర్‌లో వెనక్కి తిరిగాడు.

కళ్ళజోడు ముక్కుపైకి మళ్ళీ జారింది. దాన్ని పైకి నెట్టుకుని కణతలు బలంగా నొక్కుకున్నాడు. అతని బుర్రంతా ఆలోచనలు నిండుకున్నాయి.

ఎదురుగా ఉన్న పెద్ద విండోగ్లాస్‌నించి కార్లూ, బస్సులూ ఆటబొమ్మల మాదిరి బారులుగా పరుగెడుతూ కన్పించాయి. మనుషులయితే జాడే తెలీడం లేదు.

నవ్వుకున్నాడు జిమ్మీ.

అవును మరి! తనిప్పుడు ఎన్నో అంతస్థుల పైన వున్నాడు!

ఇంటర్‌కం 'బజ్' మనడంతో ముందుకు తిరిగి రిసీవర్ అందుకున్నాడు.

"నో!" జూలియట్‌కి సమాధానం చెబుతూనే, "మిస్ జూలీ! పన్నెండవ నంబర్ అభ్యర్థి మిస్టర్ విక్టర్ ఓలన్‌కి మెసేజ్ పంపండి " చెప్పి యింటర్‌కం కట్ చేశాడు.

"విక్టర్ ఓలన్" గొణుక్కున్నాడు మనసులో.

టేబిల్‌పైన ఫొటో వాలుగా కన్పిస్తోంది.

"నీలి కళ్ళు"

దాదాపు యిరవై రెండేళ్ళ (క్రితం....

తన జీవితంలోని ఓ పెద్ద లోటును కప్పిపుచ్చుకునేందుకు "వీణ"తో స్నేహం చేస్తున్న రోజులు....

## 2

ఫైర్ ప్లేస్ ముందు ఊగుడు కుర్చీలో కూర్చుని వుంది మార్గరీటా.

జిమ్మీ వీణ శృతి చేస్తూ కాస్త దూరంలో తివాచీ మీద కూర్చుని ఉన్నాడు, సారణి పంచమాలను పరికిస్తూ.

గూటిలోని మంట తాలూకు వెలుగు పసుపు ఎరుపుల వింత కలయికతో వెలుగునీడలుగా గది అంతా పరచుకుని వుంది.

చేతిలోని నవల సోఫాలో పడేసి టీపాయ్ మీది విస్కీగ్లాసు అందుకుంది మార్గరీటా. మంట వెలుగులో విస్కీ మరింత డార్క్‌గా అగుపిస్తోంది.

కళ్ళు మూసుకుని కుర్చీలో వెనక్కి వాలి ఏదో ఆలోచిస్తూ నెమ్మదిగా సిప్ చేసింది. గొంతులోంచి విస్కీ అలా జారుతూంటె హాయిగా అన్పించింది.

వీణ శృతి చేయడం పూర్తికావడంతో జిమ్మీ మెల్లగా ఆలపించసాగాడు. మనోహరంగా తం(త్రీ ధ్వనులు గదిని ఆ(క్రమించసాగాయి. (క్రమంగా వాదనలో లీనమైపోతూ కనురెప్పలపైన



కూడా అధీనం కోల్పోతూ భారమైనరసజగత్తులోకి జారిపోయాడు జిమ్మీ.

కళ్యాణిరాగం రెక్కలు విప్పుకొని మాధుర్యాన్ని పంచు తోంది.

విల్లీ పంగా దానిని వింటూ విస్కీ చప్పరించసాగిందిమార్గ రీటా. కాళ్ళు సోఫాపైన ఉంచి కుర్చీలో తూగుటూయలలా ఊగసాగింది. తనకు తెలియకుండానే తన ఆలోచనల నుంచి బయటపడి వీణావాదనలో లీనమైపోయి. స్వరాలకు అనుగుణంగా తాళం వేయబోయి మరుక్షణం ప్రయత్నపూర్వకంగా ఆపుకుంది. కళ్ళు తెరిచి జిమ్మీ కూర్చున్న దిశగా చిట్లించి చూసింది.

జిమ్మీ మంద్ర స్థాయిని దాటి తారస్థాయి నందుకుంటు న్నాడు ఆలాపనలో.

ఇంతలో బయటి నించి 'కాల్ బెల్' మోగింది.

మార్గరీటా అటు తిరిగింది.

జిమ్మీలో చలనం లేదు. వీణ ప్రవాహంలా మోగుతూనే ఉంది.

"ఎవరూ?" మార్గరీటా ప్రశ్నించింది.

బయటినించి సమాధానం లేదు.

లేచి వెళ్ళి విండో షీల్డ్ ఎత్తి చూసింది మార్గరీటా. అద్దం నిండా మంచుపట్టి ఉంది. బయట ఎవరో మసగ్గా కనిపించారు. లాక్ తెరిచింది.

"గుడీవెనింగ్ మేడమ్" విల్లీ లోనికి వచ్చాడు.

విల్లీని చూడగానే మార్గరీటా నవ్వింది. "వెల్‌కం విల్లీ!"

విల్లీ లోనికి వస్తూనే వులెన్ టోపీ తీసి విదిలించాడు. మంచు బిందువులు జలజలా గదంతా రాలాయి. ఓవర్‌కోటూ, హాండ్ గ్లోవ్స్ కూడా తీసి ఓ హాంగర్‌పై వదేసి మార్గరీటా కందించాడు నవ్వుతూ. అతని నీలికళ్ళు తళుక్కున మెరిశాయి.

"ఏమిటి విశేషాలు?" మార్గరీటా అడిగింది.

"ఏవుంటాయి?" ఫైర్ ప్లేస్‌కి దగ్గరగా కుర్చీ లాక్కున్నాడు విల్లీ. మార్గరీటా వచ్చి ఎదురుగా సోఫాలో కూర్చుంది. ఆమె చూపులన్నీ విల్లీ నీలికళ్ళమీదే ఉన్నాయి. గాజు గోలీలలా ఉన్న నీలికళ్ళ వెనుక ఉన్న మెరుపును చూస్తున్నకొద్దీ ఆమె చూపు తిప్పుకోలేకపోతోంది.

ఆలాపన పూర్తికావడంతో జిమ్మీ వీణఆపి కళ్ళు తెరిచాడు. ప్రశాంతమైన నిశ్శబ్దం గది అంతటా.

"హల్లో మాస్టర్ కనిపించడమే లేదు!" ప్రశ్నించాడు విల్లీని చూస్తూనే.

"కాస్త బిజీగా ఉన్నాను మిస్టర్ జిమ్మీ! ఇంతకూ మీ ప్రాక్టీస్ ఎంత వరకు వచ్చింది?'

"ఫరవాలేదు. ఏవో కొన్ని వరుసలు పలికించగలుగు తున్నాను." తాదాత్మ్యంతో జిమ్మీ చిటికెన వేలితో తీగలను కదిలించాడు.

శృతిపక్వంగా 'ట్వరణ్'మంది వీణ.

విల్లీ తలతిప్పి వ్యంగ్యంగా నవ్వాడు. "ఏమిటో మిస్టర్ జిమ్మీ! మీరా బ్లడీ ఇండియన్ ఇన్‌స్ట్రుమెంట్‌ని ఎందుకు పట్టు కున్నారో తెలియదు!" అన్నాడు మార్గరీటా నించి విస్కీగ్లాసం దుకుని కొద్దిగా చప్పరించి పెదాలు తడుపుకుంటూ.

"నేనూ అదే అంటాను" మార్గరీటా కూడా అందుకుంది.

జిమ్మీ దవడలు బిగుసుకున్నాయి. "చూడు మాస్టర్! భార తీయ సంస్కృతీ సంప్రదాయాలన్నా, కళలన్నా నాకు ప్రాణ మయ్యా! ఆ సంస్కృతిలో జీవం ఉంది. ఆ సంప్రదాయాలలో బలం ఉంది. ఆ కళల్లో పరిపూర్ణత ఉంది. ఎందుకొచ్చిన వాయిద్యం అనే ముందు యిందులో ఉన్న గంభీరత, ఉత్కృష్టత తెలుసుకో వయ్యా!" అన్నాడు.

భుజాలు ఎగురవేశాడు విల్లీ.

నవ్వింది మార్గరీటా.

"భారతదేశం నేడు నీకంటే ఆర్థికంగా వున్నత స్థితిలో లేక పోవచ్చు మాస్టర్! కాని భావోన్నతిలో నువ్వేనాటికీ చేరుకోలేని విశిష్టతవున్న వేదభూమి అది. వరదాయిని అది!" నవ్వుకుంటున్న మార్గరీటా, విల్లీలవంక బాధగా చూస్తూ తీగలను బలంగా మీటాడు.

విల్లీ అదేం పట్టించుకోలేదు.

జిమ్మీ నిగ్రహసూచకంగా కళ్ళు మూసుకుంటూ నెమ్మదిగా మోహనరాగం పలికించడం మొదలుపెట్టాడు. తొలి స్వరాలు దాటుతూనే అతను ఏకాగ్రతలో మునిగిపోయాడు.

విల్లీ కుర్చీలో ముందుకు వంగి టి.వి. బటన్ నొక్కాడు. ప్రెసిడెంట్ జాన్ ఎఫ్ కెనెడీ తెరమీద కనిపించాడు. వర్ణ విచక్షణ పాటించడం మానవతకు తగదని చెబుతూ నల్లవారికి పౌర హక్కులు ఎందుకీయాలో ఉద్వేగంగా వివరిస్తున్నాడాయన. ఇంత





లోనే న్యూస్‌రీడర్ క్లోజప్‌లోకి వచ్చి ఆనాటి "కాంగ్రెస్"లో చర్చకు వచ్చిన మిగతా అంశాల గూర్చి బులిటన్ చదవసాగాడు.

మెల్లగా విస్కీ సిప్‌చేస్తూ టీవీ షోలో లీనమౌతున్నాడు విల్లీ.

మార్గరీటా విల్లీ నీలి కళ్ళలో చిన్నగా ప్రతిఫలిస్తున్న టి. వి. బొమ్మల వెలుగునే చూస్తోంది.

గదిలో మోహనరాగం తారాస్థాయినందుకొంది జిమ్మీ హస్త విముక్తమై.

*  *  *  *

"వెళ్ళి వస్తానండి!" పూర్తి భారతీయ పద్ధతిలో చేతులు రెండూ జోడించి నమస్కరిస్తూ లేచాడు జిమ్మీ.

విరూపాక్ష అయ్యంగార్ కళవళపడుతున్నట్టు అన్నాడు— "లేదయ్యా! నా మనసంతా వికలమైపోయిందీ రోజు. మరికాసేపు కూర్చో. దయుంచి."


ఆయన మాటకు ఎదురు చెప్పగల శక్తి లేనట్టు తిరిగి కూర్చున్నాడు జిమ్మీ.

"నీ జీవితంలో యింతటి విషాదముందని నేనెప్పుడూ అనుకోలేదయ్యా!" మళ్ళీ అన్నాడు విరూపాక్ష అయ్యంగార్. "ఒక పాశ్చాత్యుడు వీణ నేర్చుకుంటున్నాడు నా వద్ద అని సంతోషించానే తప్ప అతని జీవితం ఏమిటన్నది ఏనాడూ ఆలోచించలేదు. ఈనాడు నీ గాథ నాకు కళ్ళనీళ్ళ పర్యంతం అవుతోందయ్యా!"

నేల చూపులు చూడసాగాడు జిమ్మీ.

"ప్చ్. ఎంతటి దురదృష్టవంతుడివయ్యా!" పెదవి నలుపుకుంటూ అన్నాడు విరూపాక్ష అయ్యంగార్.

"అందుచేతనేనండి వీణావాదనలో నన్ను నేను మరచిపోవడానికి అనుక్షణమూ ప్రయత్నించేది. నాకు విషాదమంటేనే భయం.... దాని ఊహే భరించలేను. కాని నేను ఈ భూమిపై పడ్డ మరుక్షణం నించి అంతా విషాదమే ... నా జీవితమంతా విషాదమే. అందుకే వీణావాదనలో ఆనందాన్ని సృజించి దానినే ఆస్వాదిస్తూ నన్నావరించిన విషాదాన్ని దూరంగా నెట్టాలని కోరిక. మీరెంత చెప్పినా నేను విషాద సూచక రాగ మొక్కటైనా నేర్చుకోకపోవడానికి కారణమదే. నా వీణ ఆనందమే పలకాలి. నాకు దూరమైన ఆ అనుభూతిని క్షణ క్షణం నాలో నింపాలి...." జిమ్మీ గొంతులో స్థిరత్వం. చెబుతూంటే.




"అర్థమైందయ్యా!" తల పంకించాడు విరూపాక్ష అయ్యంగార్. "తరచి చూస్తే నిజానికి చాలామంది కళాకారుల జీవితాలు విషాదపూరితాలేనయ్యా! అయితే హెచ్చుమంది విషయంలో వారు కళాకారులుగా రూపొందిన తర్వాత వారి జీవితాల్లో విషాదం వచ్చి చేరితే. నువ్వు నీ జీవితాన నిండివచ్చిన విషాదాన్ని మరుగుపుచ్చేందుకు కళాకారుడి వవుతున్నావ్. అంతే!" అన్నాడు విచిత్రంగా నవ్వుతూ. ఆయన వడలిన ముఖం మీది ముడుతలు బాధతో మరింత ఎక్కువైనట్టు కన్పించాయి.

దూరంగా బాలీసుమీద రెండు వీణలు మౌన ముద్రలోని యోగుల్లా కన్పిస్తున్నాయి. గోడలపై నాలుగు పక్కలా విరూపాక్ష అయ్యంగార్ అందుకున్న సన్మానాల తాలూకు ఛాయా చిత్రాలే!

వాటినించి చూపు తిప్పుకుని తిరిగి అన్నాడు జిమ్మీ— "పున్నామ నరకాన్నించి తప్పించేందుకు పుత్ర సంతానం అన్నది నన్ను విశిష్టంగా ఆకర్షించిన మరో భారతీయ భావన. నరకమనేది నేను నమ్ముతానా లేదా అనేది వేరే సంగతి. నేను మాత్రం ఆ కుటుంబ వ్యవస్థను. ఆ భావనను ఎంతగానో ప్రేమిందాను. పుత్ర సంతానం కావాలనుకున్నాను. కాని........ అక్కడా నాకు ఆశాభంగమే. నాకెప్పుడూ ఎదరయ్యే విషాదమే! పుత్ర సంతానం కాకుంటే పోనీ. నాకసలు సంతానమే లేదు."

విరూపాక్ష అయ్యంగార్ చాలాసేపటివరకూ ఏమీ మాట్లాడలేకపోయాడు. జిమ్మీ విషయంలో ఆయన ఎంచేతో అంతగా కదిలిపోయాడు. వృద్ధాప్యపు ముడుతలు ఆ క్షణాన ఆయన ముఖంలో మరింత ఎక్కువయ్యాయి.

చాలాసేపు నిశ్శబ్దం ఆ ప్రదేశాన్ని నింపింది.

చివరకు విరూపాక్షఅయ్యంగార్ తేరుకున్నాడు. "లేదయ్యా! నీ జీవితంలో విషాదం సమసిపోతుంది. నీకు తప్పక సంతానం కలుగుతుంది. అంతా చక్కబడుతుంది" అన్నాడు లాలనగా జిమ్మీ భుజంపై తట్టుతూ.

ఓ నీగ్రో యువతి ట్రేలో రెండు కప్పులతో కోకో తెచ్చి అక్కడ ఉంచి వెళ్ళింది.

*  *  *  *

ఆరోజు తన పెట్రోల్ ఫిల్లింగ్ అండ్ సర్వీసింగ్ స్టేషన్లను అలా ఓసారి చూసిరావడానికి బయల్దేరాడు జిమ్మీ.

మార్గరీటా వంటగదిలో శాండ్విచెస్ చేసే ప్రయత్నంలో వుంది.

జిమ్మీ సోఫాపై కాలుంచి షూలేసు బిగించుకుంటూండగా కాల్‌బెల్ మోగింది. "యస్" అన్నాడు.

తలుపు తెరుచుకుంది.

విల్లీ!

"వెల్‌కం మాస్టర్! గుడ్ డే!" జిమ్మీ ఆహ్వానించాడు.

"థాంక్యూ! ఎక్కడికో బయల్దేరుతున్నట్లుగా వుంది ..." విల్లీ భుజానవున్న కిట్ సోఫాలో పడేసి ఊగుడు కుర్చీలో కూర్చుంటూ అడిగాడు.

"అవును మాస్టర్! పూర్తిగా వీణలో పడి బిజినెస్ బాగా నెగ్లెక్ట్ చేశాను. రీటా పోరు కూడా బాగా ఎక్కువైంది ఈ విషయంలో. ఓసారి చూసి వద్దామనిపించి బయల్దేరుతున్నాను"

"గుడ్. కాస్త మా లోకంలో పడ్డావు!"

నవ్వాడు జిమ్మీ! ఆ నవ్వులో వాదన ఇష్టంలేదన్న ధ్వని ఉంది. "రీటా!" కిచెన్ వేపు తిరిగి పిలిచాడు. "ఇదిగో నీ నీలికళ్ళ కుర్రాడు వచ్చి కూర్చున్నాడు. కాస్త యిలా వచ్చి వెళ్ళు."

మరుక్షణం ముఖమంతా నవ్వుతో గదిలోకి వచ్చింది మార్గ

రీటా. "హల్లో విల్లీ! హౌ ఆర్యూ!" వస్తూనే అడిగింది.

"ఫైన్ మేడమ్ థాంక్యూ!" విల్లీ బదులిచ్చాడు.

"ఒక్క నిముషం. శాండ్విచెస్ తెస్తాను"

మార్గరీటా లోనికి వెళ్ళడంతో జిమ్మీ విల్లీ వంక విల్లీ జిమ్మీ వంక అలా చూసుకుంటూ ఉండిపోయారు. మాట్లాడుకోవటానికి వారిద్దరి మధ్య టాపిక్కే దొరకలేదు. మళ్ళీ మార్గరీటా వచ్చే వరకూ.

శాండ్విచెస్ టీపాయ్‌మీదుంచి మూడు మగ్స్‌లో బీర్ తెచ్చి పెట్టింది. తలోటీ అందుకున్నారు.

"నాకు మీ టైప్‌రైటర్ ఓసారి కావాలి మిస్టర్ జిమ్మీ!" శాండ్విచ్ నములుతూ అన్నాడు విల్లీ.

"ఓ ష్యూర్! లోపిగదిలో ఉంది. ఎన్నిరోజులు కావాలంటే అన్ని రోజులు వాడుకో. నాకేం అభ్యంతరం లేదు."

"థాంక్స్ ఎ లాట్. నాకు రోజుల తరబడి అక్కర్లేదు. ఓ కొన్ని గంటలపాటు చాలు. 'జేమ్స్ అండ్ జేమ్స్'లో మాడల్స్‌కి అడ్వటయిజ్ చేశారు. అప్లయి చేస్తున్నాను."

"మాడలింగ్!" జిమ్మీ ఆశ్చర్యపోయాడు.

"యస్ మిస్టర్ జిమ్మీ! అంత ఆశ్చర్యమెందుకు!"

మార్గరీటా తనకు అది ముందుగానే తెలిసినట్టు వాళ్ళిద్దరి సంభాషణనూ గమనిస్తోంది మౌనంగా.

"లేదు మాస్టర్! తొందరపాటుతో నిర్ణయాలు తీసుకోకు. నీ కెంతో మంచి భవిష్యత్ వుంది. చదువు నుంచి యిలా దృష్టి మరలించకు. మాడలింగ్ వద్దు. చాలా కాంపిటిటివ్ ప్రపంచమది. ఆ రిస్క్ నువు తట్టుకోలేవు." చెప్పాడు జిమ్మీ.

"వాట్ మిస్టర్ జిమ్మీ! మరీ యిలాంటి కబుర్లు చెబుతారు. నా ఫిజిక్ చూడండి- నన్ను చూడండి. నేను మాడల్‌గా సక్సెస్ కాలేనంటారా! అసలు 'జేమ్స్'లో సెలక్ట్ కావాలేగాని...."

విల్లీ మాటలకు అడ్డు వస్తూ మార్గరీటా అంది: "నువు తప్పకుండా సెలక్టవుతావ్ విల్లీ, అసలు నీకు నీ నీలికళ్ళే సగం ఎసెట్."

జిమ్మీ చప్పరించేశాడు. "ఏమిటి రీటా సిల్లీగా మాట్లాడుతా నీలికళ్ళు ఉన్నవాళ్ళే కావాలంటే ఎంతమంది దొరకరు!"

"బట్." అందుకుంది మార్గరీటా. "విల్లీ కళ్ళ వెనుక ఓ అద్భుతమైన మెరుపుంది. దట్స్ యునీక్!" తర్జనితో చెప్పింది.

గర్వంగా జిమ్మీ వంక చూశాడు విల్లీ.

భుజాలు ఎగురవేశాడు జిమ్మీ. బీరు పూర్తిచేసి లేచి నుంచున్నాడు "నో.... నేను చెప్పేదేం లేదు కనుక. విష్యూ గుడ్‌లక్!" అంటూ విల్లీ దగ్గరకు నడిచి చేయి చాచాడు.

విల్లీ చెయ్యందిస్తూ మార్గరీటా వంక చూసి నవ్వాడు. "థాంక్యూ!"

జిమ్మీ విల్లీ భుజంపై తట్టి నెక్‌టై పైకి లాక్కుని గుమ్మం వైపు నడిచాడు.

"డోంట్ బి టూ మాడెస్ట్. అన్నిసార్లు 'థాంక్స్' చెప్పక్కర్లేదు" మార్గరీటా అంటోంది.

* *

రోజులు గడుస్తున్నాయి.

జిమ్మీకెందుకో ఆరోజు ఉదయంనించీ అసహనంగా ఉంది. కారణం తెలియదు.

వీణ ముందు కూర్చున్నా ఏకాగ్రత కుదరలేదు. ఎంత నిగ్రహించుకున్నా ఏదో అనీజీనెస్ మనసునిండా కమ్ముకుంటోంది.

మధ్యాహ్నానికి కబురందింది. గుండెపోటుతో విరూపాక్ష అయ్యంగార్ని హాస్పిటల్లో చేర్చారు.... కొద్ది క్షణాలు జిమ్మీ మనసు మొద్దుబారిపోయింది.

హాస్పిటల్ చేరుతూనే తుఫానులా యింటెన్సివ్ కేర్ వైపు వెళ్ళాడు. ఎగశ్వాసలతో డాక్టర్ల నడుమ ఉన్నాడు విరూపాక్ష అయ్యంగార్.

జిమ్మీని చూస్తూనే కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు. దగ్గరకు రమ్మని చేయి నిమిరాడు. కళ్లవెంబడి నీళ్లు ధారాపాతంగా కారిపోతూనే వున్నాయి. మరికొద్ది సేపటికే విరూపాక్ష అయ్యంగార్ ఎగశ్వాస ఎక్కువైంది.

జిమ్మీ పక్కనే కూర్చున్నాడు.

విరూపాక్ష అయ్యంగార్ కళ్లు మూతలు పడ్డాయి.

అంతులేని విషాదాన్ని గొంతుకిందే అణచిపెట్టిన జిమ్మీ కంటినుండి ఓ నీటిచుక్క జారి బెడ్‌పై యింకిపోయింది.

ఎలక్ట్రిక్ క్రెమెటోరియంలో అంత్యక్రియలు కానిచ్చి ఓ పాలిథిన్ సంచీడు బూడిదతో రాత్రి పన్నెండవుతూండగా యింటికి చేరిన జిమ్మీని మార్గరీటా రివ్వున వచ్చి చుట్టేసింది.

"నేను తల్లిని కాబోతున్నాను." చెప్పింది.

ఓ క్షణం ఆగిన తర్వాత వేదనతో చిన్న నవ్వు వచ్చింది జిమ్మీ ముఖంపైన. 'విరూపాక్ష అయ్యంగార్ మాట నిజమైంది' అనుకున్నాడు ముందు.

'లేదు విరూపాక్ష అయ్యంగారే తిరిగి జన్మిస్తున్నాడు' అనుకున్నాడు మరుక్షణం.




## 3

ఇక ఆలోచనలను కొనసాగించే ఓపిక లేనట్టు తలపట్టుకున్నాడు. జిమ్మీ రివాల్వింగ్ చెయిర్‌లో ముందుకు తిరిగి.

గదిలోని ఎయిర్ కండిషనర్ అతని మనసుని చల్లబరచలేకపోతూంది. నుదుటన చిరుచెమటలు.

ఇంటర్‌కం "బజ్" మంది దృష్టి మరలిస్తూ.

రిసీవర్ ఎత్తి జూలియట్‌కి సమాధానం చెప్పాడు.

అతనికి మనసంతా అసహనంగా ఉంది. ఆలోచనలు అణచిపెట్టాలని తీవ్ర ప్రయత్నం చేస్తున్నా ఫలించడంలేదు. టేబుల్ పైన ఉన్న కలర్ ఫొటోలోని వ్యక్తి నీలికళ్ళు చూస్తూనే జిమ్మీ భరించలేనట్టు కళ్ళు మూసుకున్నాడు.

ఆనాడు మార్గరీటా తనకు సంతానం కలుగబోతున్నదని చెప్పినప్పుడు తనకు పట్టలేని సంతోషం కలిగింది. తన జీవితంలో విషాదానికి హంసగీతి పలికిందని ఆనందించాడు.

కాని జరిగిందేమిటి?

జరిగిందేమిటి ?

....మళ్ళీ గతంలోకి జారిపోయాడు జిమ్మీ.

## 4

మిన్నంటుతున్న కరతాళ ధ్వనుల మధ్య కచేరీ పూర్తి చేసి లేచాడు జిమ్మీ. ప్రెస్ ఫోటోలు చక్....చక్....చక్....మంటూ మెరిసిపోయాయి.

ఎందరో ముందుకు వచ్చి కౌగిలించుకున్నంత పనిచేసి అభినందించారు.

ఏనాడూ అంతటి ఆనందం అనుభవించని జిమ్మీకి 'ఇది నిజమేనా?' అని అనుమానం కలిగింది. 'భగవాన్ ఈ ఆనందం శాశ్వతం చెయ్యి' అంటూ మనసులో మూగగా క్రీస్తుకు మొక్కుకున్నాడు.

మూగుతున్న జనాన్ని తప్పించుకు బయిటికి రాగానే తన చేయి ఎవరో పట్టుకున్నారు. చూస్తే శ్రీనివాస అయ్యంగార్. విరూపాక్ష అయ్యంగార్ కొడుకు.

కెఫెటేరియాకు దారితీశాడు జిమ్మీ.

కూర్చుంటూ ఓ కవరు బయటికి తీశాడు శ్రీనివాస అయ్యంగార్. "ఈ కవరు మీ పేరుతో మా తండ్రిగారి సొరుగులో దొరికింది....ఆయన పోయాక. మీకు దీన్ని అందచేయాలని ఆనాటి నుంచీ ప్రయత్నిస్తున్నా. మీరు దొరకలేదు. నాన్నగారు పోయాక మీరసలు మా యింటికే రాలేదు. ఓ సారి రండి" అంటూ కవరందించాడు

"విరూపాక్ష అయ్యంగార్ తనకో కవరుంచాడా?" భృకుటి ముడిపడుతూండగా కవరు చించి వెంటనే కాగితాన్ని బయటకు తీశాడు జిమ్మీ.

అప్పటికి విరూపాక్ష అయ్యంగార్ పోయి ఆరు నెలలవుతూంది.

అందంగా టైప్‌చేసి ఉన్న ఆ చిన్న కాగితం చదువుతూనే జిమ్మీ తలపై పిడుగులు పడినట్టయింది!

అంతకుముందో క్షణం వరకూ వున్న ఆనందం పటాపంచలైంది!

కళ్ళు మసకబారుతూండగా నిలదొక్కుకున్నాడు.

విరూపాక్ష అయ్యంగార్ చనిపోతాడనగా రెండు రోజుల ముందు బలవంతం చేసి జిమ్మీ వీర్యాన్ని లేబొరేటరీకి పంపాడు. పరీక్ష కోసం.

ఆ సెమెన్ రిపోర్టది.

జిమ్మీకి ఒళ్ళంతా విస్ఫత్తువ ఆవరించింది.

ఆ రిపోర్టు ప్రకారం తనకు ఎప్పటికీ సంతానం కలుగదు. సంతానోత్పత్తికి కావలసిన బీజకణాలు తన వీర్యంలో లేవు.

ఉలిక్కిపడ్డాడు జిమ్మీ ఓ క్షణం. 'మరి....మరి....మార్గరెట్!' గొణుక్కున్నాడు.

అంతే!

మరుక్షణం మళ్ళీ యోగిలా మారిపోయాడు జిమ్మీ.

ఎప్పటిలా నిశ్శబ్దం అతన్ని ఆవరించింది.

ఆ మర్నాడు హాస్పిటల్ నించి మార్గరీటా మగ పిల్లవాడిని ప్రసవించిందన్న వార్త ఫోన్‌లో విని ఎప్పటికో నిర్లిప్తంగా హాస్పిటల్ చేరాడు. జిమ్మీ ఏ భావానికీ అతీతుడుగా ఉన్నాడు. ముఖంలో అంతులేని నిర్వేదం.

ఊయలలో ఉన్న బేబీ వైపు వెళ్ళాడు. కాళ్ళు, చేతులు కేరింతలు కొడుతూ బలంగా ఉన్నాడు బాబు. ఉండుండి రెప్పలు చికిలిస్తున్నాడు....

పీడీ పీకని ఆ రెప్పల వెనుక నీలికళ్ళు!

అద్భుతమైన మెరుపుతో నీలికళ్ళు!

"విల్లీ రాలేదేం రీటా?" నెమ్మదిగా అడిగాడు జిమ్మీ ఓ క్షణం ఆగి.

వణుకుతున్న పెదవిని బలంగా అదిమిపడుతూ తలవంచుకుంది మార్గరీటా.

బయటికి నడిచాడు జిమ్మీ.

## 5

"ఆ రోజు తర్వాత మార్గరీటాని చూడలేదు తను" తల పంకిస్తూ అనుకున్నాడు జిమ్మీ. "అసలు ఏమైందో కూడా తెలియదు....

ఎలా వుందో! తనలానే ముసలిదై పోయి ఉంటుంది!"

"విక్టర్ టిలన్!" మరోసారి అనుకుంటూ టేబుల్ మీద ఉన్న అప్లికేషన్ అందుకున్నాడు జిమ్మీ. కళ్ళజోడు ముక్కుపైకి జారింది. దాన్ని పైకి నెట్టుకుంటూ అడ్రస్ చూశాడు.

లేచి ఎలివేటర్ వైపు నడిచాడు. ఆ కాగితాలు జేబులో తురుముకుంటూ.

అన్ని వర్గాల పాఠకులను అలరిస్తున్న
"ఆంధ్రజ్యోతి" డెయిలీ సీరియల్
"తోడూ - జోడూ"
ప్రఖ్యాత రచయిత డాక్టర్ కొమ్మూరి వేణుగోపాలరావు కలం నుంచి వెలువడుతున్న ఆకర్షణీయమైన నవలను మీరు చదువుతున్నారా?

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్సా
విరేచనముతో
చికిత్సను పొందండి
- శస్త్రచికిత్స
అవసరముండేదు!

